క్లుప్తంగా

నేడు దావూద్‌గూడకు మంత్రి రాక

కందుకూరు: మండలంలోని దావూద్‌గూడలో గురువారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి సమక్షంలో ఎంపీటీసీ రాజమ్మతో పాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని జెడ్పీటీసీ జంగారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

మంత్రికి మెమెంటో అందజేత



మంత్రికి మెమెంటోను అందజేస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో భాగంగా బార్కాస్ బామ్ కాలనీకి వచ్చిన మంత్రి సబితారెడ్డికి బార్కాస్ వెల్ఫేర్ అసోసియేషన్, బార్కాస్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో చార్మినార్ మెమెంటోను అందజేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నారని ప్రతినిధులు తల్హా కసేరీ, ఇక్బాల్ బిన్ ఖలీఫా, డాక్టర్ మోసిన్ ఖురేషీ, సల్లుం బిన్ ఖలీఫా, తయ్యబ్ బామ్ కొనియాడారు.

గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సుధీర్‌గౌడ్



మండల గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మహేశ్వరం: మహేశ్వరం మండల గౌడ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా నిమ్మగూడెం సుధీర్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండలంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో గౌడ సంక్షేమ సంఘం ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌గౌడ్ మాట్లాడుతూ మండలంలో గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ప్రతి గౌడ విద్యా, ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. గౌడలకు అన్ని రాజకీయ పార్టీలు గుర్తింపుతో పాటు గౌరవం ఇవ్వాలన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నిర్వాసితులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట దావుత్‌ఖాన్‌గూడలోని సర్వేనెంబర్–2లోని దళితుల భూమిని దళితులకే చెందాలని కోరుతూ.. గత కొద్ది రోజులుగా నిరసన ర్యాలీలు, దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం నిరసన దీక్షలు అనంతరం రంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాల్లో ఉన్న భూమినే దళితులకు ఇవ్వాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో గుడ్ల శ్రీనివాస్, రాములు, రమేష్, సురేష్, ఉమాకాంత్, అంజమ్మ, అండాలు, కమలమ్మ తదితరులున్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు జీవితఖైదు



నిందితుడు గాలయ్య

మీర్‌పేట: భార్యపై కిరోసిన్ పోసి నిప్పంటించి ఆమె మృతికి కారణమైన భర్తకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా –2వ మెట్రోపాలిన్ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి అల్మాస్‌గూడ మల్‌రెడ్డి రంగారెడ్డి కాలనీకి చెందిన నార్ల గాలయ్య 2006లో మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్య అలివేలుపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన ఆమె మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మీర్‌పేట పోలీసులు గాలయ్యపై కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాము, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.కస్తూరి కేసును పరిశీలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి రూ.400 జరిమానా, జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

యాచారం: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ యాదవ్ పేర్కొన్నారు. పీఆర్టీయూటీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని యాచారం, నల్లవెల్లి, చింతుల్ల, నందివనపర్తి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే 317 జీవో ద్వారా బదిలీ చేసిన ఉపాధ్యాయులను వెనక్కి తీసుకరావాలని డిమాండ్ చేశారు. యాచారం మండల అధ్యక్షుడు మర్పల్లి మహేష్ యాదవ్, గౌరవాధ్యక్షుడు భోజయ్య, ప్రధాన కార్యదర్శి యాదగిరి, రాష్ట్ర బాధ్యులు సురేష్, యాదయ్య, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి కటాక్షించేనా!

- ధరఖాస్తులు తీసుకునే వారే లేరా?
- ఆదిలోనే హంసపాదు
- దరఖాస్తుకు ఆందోళన
- తిరుగుముఖం పట్టిన లబ్ధిదారులు



మీ-సేవా కేంద్రంలో కిక్కిరిసిన లబ్ధిదారులు

కందుకూరు: డబుల్ బెడ్‌రూం ఇంటి స్థానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన గృహలక్ష్మి పథకానికి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. అర్హులను ధరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఆహ్వానించింది. అది కూడా ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సమయంలో తక్కువ ఉండడంతో అర్హులు అన్నీ ధ్రువీకరణ పత్రాలను తీసుకుని తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లారు. కానీ అక్కడ ధరఖాస్తులు తీసుకునే నాథుడే కరువయ్యాడు. ఇదేమని ప్రశ్నిస్తే తమకెలాంటి ఉత్తర్వులు రాలేదని తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు చెప్పడంతో లబ్ధిదారులు బిక్కముఖం వేశారు. ఏం చేయాలో తెలియక పక్కనే ఉన్న ఎంపీడీఓ, ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి అక్కడి నుంచి ఉసూరుమంటూ వెనక్కి తిరిగివెళ్లారు.

దరఖాస్తు గడువు పెంచాలి

కందుకూరు: గృహలక్ష్మీ పథకం కింద దరఖాస్తులు చేసుకోవడానికి మరింత సమయం కేటాయించాలని రాష్ట్ర సర్పంచుల ఫోరం సంయుక్త కార్యదర్శి సాధ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గృహలక్ష్మీ పథకానికి మూడు రోజుల గడువు ఇచ్చి నిరుపేదలతో చెలగాటమాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దరఖాస్తు గడువు పెంచడంతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

గృహలక్ష్మీకి దరఖాస్తుల కరువు !

పహాడీషరీఫ్: సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మీకి జల్‌పల్లి మున్సిపాలిటీలో దరఖాస్తులే కరువయ్యాయి. బుధవారం ఉదయం వరకు మున్సిపాలిటీ అధికారులకు ఎలాంటి మార్గదర్శకా లు అందకపోవడంతో లబ్ధిదారులు దరాఖాస్తులు చేసుకోలేదు. ముస్లీంలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో ఈ పథకం గురించి ప్రచారమేలేదు. వెరసి మీ సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకునేందు కు ప్రజలు వెళ్లని పరిస్థితి కనిపించింది. నోటరి ఇళ్ల దరఖాస్తులు, మైనారిటీ కమిషన్ అందజేస్తున్న రూ. లక్ష సబ్సిడీ రుణాలకు మాత్రమే మీ సేవా కేంద్రాల వద్ద లబ్ధిదారుల హడావిడి కాస్త కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం కలెక్టర్ నుంచి అందిన ఆదేశాలతో గురువారం నుంచి మున్సిపాలిటీ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తు ఫారాల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మున్సిపాలిటీ అధికారులు వెల్లడించారు.

గృహలక్ష్మి ధరఖాస్తులు తీసుకోం

బడంగ్‌పేట్: గృహలక్ష్మి ధరఖాస్తులు తీసుకోమని బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది అర్హులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరఖాస్తుకు ఒకే రోజు గడువు ఉండటంతో లబ్ధిదారులు మీ–సేవాలో ధరఖాస్తు చేసుకునేందుకు వెళితే తమకు ఇంకా లాగిన్ ఇవ్వలేదన్నారు. లబ్ధిదారులు దరఖాస్తులు ఇచ్చేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే సిబ్బంది విసుక్కుంటున్నారని వాపోతున్నారు.

సమాచారం లేదంటున్నారు



మేం గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించనున్న ఆర్థిక సహాయానికి ధరఖాస్తు చేసుకోవడానికి వచ్చాం. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ధరఖాస్తు తీసుకోవడం లేదు. మాకు సమాచారం లేదంటున్నారు.

– యాదగిరి, లబ్ధిదారుడు, గూడూరు

ఏం చేయాలో తెలియడం లేదు



గృహలక్ష్మి పథకానికి ధరఖాస్తు చేసుకోవడానికి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాం. ఉదయం నుంచి సాయంత్రం ఎదురుచూసినా ఎవరూ పట్టించుకోలేదు. పక్కన ఉన్న అన్ని కార్యాలయాలకు వెళ్లాం. అక్కడ మాకు తెలియదంటున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు.

– మాధవి, లేమూరు

బీజేపీ రాజకీయం చేస్తోంది



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, మేయర్ పారిజాతపై బీజేపీ నేతలు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకులు జంగయ్య మండిపడ్డారు. బుధవారం మల్లాపూర్‌లో వారు మాట్లాడుతూ పారిజాత మేయర్ నాయకత్వంలో బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధి చెందుతుందన్నారు. సర్వే నంబర్–2లో కలెక్టర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్లు కలిసి కౌన్సిల్ మీటింగ్‌లో తీర్మానం చేసిన తర్వాతనే ప్రభుత్వ భవనాలు నిర్మించామన్నారు. కౌన్సిల్ తీర్మానం చేసేటప్పుడు బీజేపీ కార్పొరేటర్లు కూడా ఉన్నారని గుర్తుచేశారు. మేయర్‌ను అపత్రిష్టపాలు చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దావుత్‌ఖాన్‌గూడలో నిరసన దీక్షలు చేస్తున్న దళితులకు భూమి దక్కేవరకు కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ బంగారి మనోహర్ తదితరులున్నారు.

చెరువు శిఖం స్థలాన్ని కాపాడండి

మీర్‌పేట: కబ్జాకు గురవుతున్న చెరువు శిఖం భూమిని రక్షించాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ రెడ్డి సంఘం నాయకులు బుధవారం రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లెలగూడ చందన చెరువుకు సంబంధించిన సర్వే నెం–155లో 33 ఎకరాల 05 చెరువు స్థ లం ఉందని, ఆర్‌సీఐ ప్రధాన రహదారి పక్కన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా చెరువు శిఖం స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మించి వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి నిర్మాణాలను తొలగించి, కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ వేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, జైసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీహెచ్‌ఎంసీ కార్మికులు

హుడాకాంప్లెక్స్: దీర్ఘకాలికంగా ఉన్న జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 40 ఏళ్లుగా పనిచేస్తున్న జీహెచ్‌ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.24వేలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అదే విధంగా జీహెచ్‌ఎంసీ కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య, సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్యలు ఉన్నారు.

నిధుల మంజూరుపై బీఆర్‌ఎస్ హర్షం



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ నాయకుల ర్యాలీ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి రూ.50 కోట్లు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేయడంతో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గానికి స్పెషల్ గ్రాంట్ నుంచి రూ.160 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖమంత్రి సబితారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు భీమిడి స్వప్న, ఏనుగు రాంరెడ్డి, లిక్కి మమత, శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌యాదవ్, శివకుమార్, జంగారెడ్డి, ముత్యాల కృష్ణ, టీకుల భాస్కర్‌రెడ్డి, రమేష్, గుర్రం వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతితో గ్రామాల్లో సమూల మార్పులు

విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి



పనులను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, జేడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: పల్లె ప్రగతితో గ్రామాల్లో సమూల మార్పులు రావడంతో పాటు తెలంగాణ పల్లెలకు జాతీయ స్థాయిలో అవార్డుల పంట పండిందని విద్యాశాఖ మంత్రి పి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామంలో రూ. కోటి 13లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులను ఆమె జేడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పల్లె ప్రగతిలో పల్లెల్లో అభివృద్ధి జరగడంతో పాటు రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇంటి ఖాళీ జాగ ఉండి ఇళ్లు నిర్మాణం చేసుకునేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. మండల పరిషత్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. అంతకు ముందు గ్రామంలో బీటీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ భవనం, నూతన గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా నాయక్, సిరిగిరిపురం సర్పంచ్ కాసుల సురేష్, ఉప సర్పంచ్ లక్ష్మీపాండు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహా పాల్గొన్నారు.

సొంతింటి కలను నేరవేరుస్తాం..

ఇళ్లు లేని పేదల సొంతింటి కల నేరవేర్చటానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సిరిగిరిపురం గ్రామంలో 200 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున ఇంటి స్థలాల పట్టా పత్రాలను జేడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం ఇవ్వాలని చేసిన విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి జాగలను ఇస్తున్నారన్నారు. ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు అర్హులైన వారిని గుర్తించి గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు నిర్మాణం చేసుకోవడానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన వారు మండల పరిషత్ కార్యాలయాల్లో, మున్సిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయం



జాతీయ జెండాలపై అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది

దిల్‌సుఖ్‌నగర్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు పోస్టల్ అధికారి రవికిషోర్ తెలిపారు. బుధవారం రామకృష్ణాపురం సౌత్ సబ్ డివిజన్ పోస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 20 నుంచి 30 అంగుళాల నిడివి గల జాతీయ జెండాను రూ.25కు విక్రయిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో కూడా అమ్మకాలు చేస్తున్నామని, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారి అడ్రస్‌లో తపాలా సిబ్బంది జెండాను అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



సాయిగణేశ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: ఇటీవల కురిసిన భారీవర్షాలకు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో వరద ముంపునకు చెడిపోయిన రోడ్లు, డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ కోరారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని ధాతునగర్, సాయిగణేశ్‌నగర్ మీదుగా నిర్మించిన వర్షపు నీటి కాలువ వల్ల ముంపునకు గురై అక్కడ కొన్ని రోడ్లు దెబ్బతిన్నాయి. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వాణితో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్ ఆ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పనులన్నింటినీ అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీర్‌పేట డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, మీర్‌పేట కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, ఇంజినీర్లు శ్రీనివాస్, హేమూ నాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాధర బట్టు, శివకుమార్, యాదగిరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్: కడ్తాల్ మండలం మద్దెలకుంట తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్న రామంజ, బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, సర్పంచ్ భారతమ్మ, మాజీ సర్పంచ్‌లు విఠలయ్యగౌడ్, యాదయ్య పరామర్శించారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్ధన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, రమేశ్‌గౌడ్, వంశీ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మైసిగండిలో..

మైసిగండి గ్రామంలో గుండె ఆపరేషన్ చేయించుకున్న దస్లా నాయక్‌కు, వైద్య ఖర్చుల నిమిత్తం ఐక్యత ఫౌండేషన్ నిర్వాహకులు, రూ.5 వేలు సాయం అందిజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్‌సింగ్, వినోద్‌నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన ఓర్సు రాములయ్య మంగళవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినర్సింహారెడ్డి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ బుధవారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు రూ.5 వేలు, రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, వెంకటేశ్, యాదయ్య, సురేశ్, లక్ష్మన్, మహేశ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: దస్లానాయక్‌కు చెక్కు అందిస్తున్న నాయకులు

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గోపాల్‌నాయక్

మీర్‌పేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరమని టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు.విద్యారంగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఈనెల 12న జిల్లా కేంద్రాల్లో చేపట్టనున్న ధర్నాకు సంబంధించి వాల్‌పోస్టర్లను బుధవారం మీర్‌పేట జిల్లెలగూడలోని ప్రభుత్వపాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి గోపాల్‌నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా చేపడుతున్న ధర్నాకు ఉపాధ్యాయులంతా సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ బాలా పూర్ మండల అధ్యక్షుడు శంకరయ్య, మహిళా ఉపాధ్యక్షులు నాగమణి, కార్యదర్శులు ఆంజనేయులు, సురేష్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి

గౌడ సంఘం అధ్యక్షుడు చుక్కా అల్లాజీగౌడ్

కడ్తాల్: హక్కుల సాధనకు గౌడ కులస్తులు కృషి చేయాలని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు చుక్కా అల్లాజీగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ముద్వీన్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా కృష్ణయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనుగౌడ్, నర్సింహగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా నరేశ్‌గౌడ్, రాములుగౌడ్, జంగయ్యగౌడ్, కోశాధికారిగా శ్రీనుగౌడ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్యగౌడ్, ఉప సర్పంచ్ వినోద్‌కుమార్‌గౌడ్, తాలుక గౌడ సంఘం ఉపాధ్యక్షులు రవిగౌడ్, గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసిగండిలో గిరిజన దినోత్సవం

పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్



కడ్తాల్: గిరిజనులతో కలిసి కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేయాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ గిరిజనులతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గిరిజన తండాలకు అనేక సమస్యలు వేధిస్తున్నాయని, వాటి అభివృద్ధి అంతంత మాత్రమే జరిగిందన్నారు. ఇప్పటికైన గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి, గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జవహర్ లాల్‌నాయక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, తులసీరాం, రామునాయక్, తదితరులు ఉన్నారు.